ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 9 ఏప్రిల్ 2024

విశాఖ రైల్వేస్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- మరమ్మతులు ప్రారంభించిన అధికారులు
- బ్రిడ్జి పనులు పూర్తయ్యేంత వరకూ ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించుకోవాల్సిందిగా అధికారుల సూచన - వార్త లోపలి పేజీల్లో..



సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!



అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ

నాలుగేళ్లపాటు నాన్చి... చివరకు సాధ్యం కాదని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం



పాదయాత్రలో సీపీఎస్ ఉద్యోగులతో కలిసి నడుస్తున్న జగన్

- కొత్తగా జీపీఎస్ విధానం
- నమ్మించి దగా చేశారని ఉద్యోగుల మండిపాటు
- జీపీఎస్ పేరుతో మరింత నష్టం తలపెట్టారంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో సీపీఎస్ ఉద్యోగులు 30 వేల మంది

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో పనిచేసే ఉద్యోగులను సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో 'సీపీఎస్ రద్దు ఎంతసేపు... అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో చేస్తానన్న' అంటూ కొండంత హామీ ఇచ్చి... తీరా అధికారం చేపట్టిన తరువాత నాలుగేళ్లు నాన్చి, నాలుక మడతేశారు. చివరకు సీపీఎస్ రద్దు చేయలేనని... అంతకంటే గొప్ప పథకం అంటూ గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకువచ్చారు. దీనిపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు.

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్న చందంగా మారింది రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వడంతో మెజారిటీ ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచారు. తీరా అధికారం చేపట్టాక నాలుగేళ్లు దానిపై మాట్లాడకుండా మౌనం దాల్చి... తీరిగ్గా రద్దు సాధ్యం కాదని తేల్చేసి...అంతకంటే మంచిదంటూ జీపీఎస్‌ను తెరపైకి తీసుకురావడంతో ఉద్యోగులంతా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓపీఎస్ (పాత పింఛన్ విధానం) అమలే ఎజెండాగా ఉద్యమిస్తామంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేశారు. అంటే ఆ తరువాత ప్రభుత్వ సర్వీసుల్లో చేరిన ఉద్యోగులకు సీపీఎస్ మేరకు పింఛన్ అందుతుంది. అంతకుముందు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత విధానం మేరకు పింఛన్‌తోపాటు ఆరోగ్య కార్డులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో సీపీఎస్‌పై ఉద్యోగులు ఆందోళనలకు దిగారు. ప్రతి ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేశారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఇస్తామని 2014లో చంద్రబాబు భరోసా ఇచ్చినా ఉద్యోగులు మాత్రం 'సీపీఎస్' రద్దు తప్ప మరో మాటలేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య లక్షలకు చేరడంతో నిరసన స్వరం పెరిగింది.

పాదయాత్రలో మోసపూరిత హామీ



కాగా 2018లో పాదయాత్ర చేపట్టిన అప్పటి విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇవ్వడంతో ఉద్యోగులంతా అతని అడుగులో అడుగువేసి పాదయాత్రలో వినతిపత్రాలు ఇచ్చి నీరాజనాలు పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయంలో కీలకభూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సీపీఎస్ రద్దుపై కేబినెట్‌లో చర్చించి కమిటీ వేశారు. తరువాత మరో రెండు కమిటీలు వేసినా రద్దు మాట మరిచిపోయారు. ఈ క్రమంలో ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. అయితే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులతో వైసీపీ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించినప్పుడే జగన్‌పై తమకు నమ్మకం పోయిందని ఆనందపురం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు వ్యాఖ్యానించారు. సీపీఎస్ రద్దు మాట దేవుడెరుగు... సామాజిక మాధ్యమాల్లో వైసీపీ మూకలు తమపై విషం కక్కడం మరింత ఆవేదన కలిగించిందన్నారు. మంత్రులు, అధికారులతో పలు దఫాలు చర్చలు జరిపినా ఓపీఎస్ అమలు తప్ప మరేదైనా కోరుకోవాలనడం మోసం చేయడమేనని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి ఒకరు దుయ్యబట్టారు. చివరకు జీపీఎస్ అంటూ ఉద్యోగులకు నష్టం చేసేలా ఓ పథకాన్ని ... మిగతా 8వ పేజీలో

జగనన్న కాలనీలో కష్టాలెన్నో!

కుసర్లపూడిలో కనీస వసతులు కరువు

- రోడ్లు, విద్యుత్, తాగునీరు లేక లబ్ధిదారుల అవస్థలు
- అధికారుల ఒత్తిడితో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుని ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు



కనీసం రోడ్డు సౌకర్యం లేని కుసర్లపూడిలోని జగనన్న కాలనీ

రోలుగుంట, ఏప్రిల్ 8:

'మండలంలోని కుసర్లపూడిలో గల జగనన్న కాలనీలో రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు లేవు. అన్ని వసతులు కల్పిస్తామని, ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడంతో రెండేళ్ల క్రితం అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాం. ఇప్పటి వరకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం' అని లబ్ధిదారులు వాపోతున్నారు.

మండలంలోని కుసర్లపూడి గ్రామ శివారున మెట్టను ఆనుకుని 34 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అధికారులు లేఅవుట్‌ను చదును చేయకుండా నిర్మాణానికి అనువుగా లేని మెట్ట ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడానికి మొదట్లో విద్యుత్ శాఖ అధికారులు ప్రయత్నించారు. అయితే స్తంభాలు వేయడానికి వీలు పడడం లేదని అప్పటి నుంచి వదిలేశారు. అలాగే రూ.10 లక్షలతో మంచినీళ్ల ట్యాంకు నిర్మాణం చేపట్టి మధ్యలోనే ఆపేశారు. కాగా ఇప్పటి వరకు కాలనీలో రోడ్లు నిర్మించలేదు. దీని వల్ల ఇళ్ల నిర్మాణానికి సామగ్రి తెచ్చుకోవడం లబ్ధిదారులకు కష్టంగా మారింది. అయితే మౌలిక వసతులు కల్పించకుండా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొదట్లో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. ప్రభుత్వం, అధికారులు తీవ్ర ఒత్తిడి తేవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. మొత్తం లబ్ధిదారుల్లో 20 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోగా, మిగతా 14 మందికి చెందిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొంత మంది పునాది తీసి వదిలేశారు. అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ఎటువంటి సౌకర్యాలు లేని ఆ కాలనీలో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడి సమస్యలపై పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని వారు వాపోతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మోటారు

సౌకర్యాలు లేక అవస్థలు



జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని, ఇల్లు నిర్మించుకోవాలని అధికారులు చెప్పడంతో ఇల్లు కట్టుకున్నాం. రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ సదుపాయం లేవు. మంచినీళ్ల కోసం కిలోమీటరు దూరంలో ఉన్న బోరుబావి వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఇక్కడ చాలా అవస్థలు పడుతున్నాం.

\- సబ్బవరపు రాజులమ్మ, లబ్ధిదారు

చాలా ఇబ్బందులు పడుతున్నాం



ఎన్నో వ్యయప్రయాసలు పడి ఇల్లు నిర్మించుకున్నాం. రెండేళ్లు అవుతున్నా ఇక్కడ ఏ సౌకర్యాలు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం లేదు. మెట్టపై విద్యుత్ స్తంభాలు వేయడానికి వీలుపడలేదని విద్యుత్ శాఖ అధికారులు వదిలేశారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

\- సబ్బవరపు సత్యవతి, లబ్ధిదారు

చోడవరంలో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తా..

- ప్రభుత్వ సహకారం లేకుండానే ఏర్పాటుకు సంసిద్ధం
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

చోడవరం, ఏప్రిల్ 8: చెరకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ సహకారం లేకుండానే చోడవరంలో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి తాను సంసిద్ధంగా ఉన్నానని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ప్రకటించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో చెరకు సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, చోడవరంలో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తానన్నారు. త్వరలోనే అన్ని పంచాయతీల్లో వీలైనంత వరకు తిరుగుతానని, కార్యకర్తలందరికీ అందుబాటులోనే ఉంటానన్నారు. తన కోసం 40 రోజులు కష్టపడితే రానున్న ఐదేళ్లు తాను కార్యకర్తల కోసం కష్టపడతానని భరోసా ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో మినహా మిగిలిన సమయంలో అనకాపల్లిలోనే ఉంటానని, ఢిల్లీలో ఉన్నా కార్యకర్తలకు కష్టం వస్తే గంటల్లోనే వాలిపోతానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నేతలు కేఎస్ఎన్ఎస్ రాజు, పైలా ప్రసాదరావు, బత్తుల తాతయ్యబాబు, గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, కనిశెట్టి మత్స్యరాజు, బొడ్డేడ గంగాధర్, మజ్జి గౌరీశంకర్, జనసేన నాయకుడు సిరిపురపు రమేశ్ పాల్గొన్నారు. అంతకు ముందు సీఎం రమేశ్ స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో గణపతిని దర్శించుకుని పూజలు చేశారు.



విచారణకు హాజరై పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చి మాట్లాడుతున్న సీఎం రమేశ్

కూటమికి మద్దతు తెలిపే అధికారులను బెదిరించడమే స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ లక్ష్యం - వార్త 9వ పేజీలో..

వంతెన గతి ఇంతేనా?

నిధులున్నా ప్రారంభంకాని తాచేరు కొత్త వంతెన నిర్మాణం

- తాత్కాలిక డైవర్షన్ రోడ్డు నిర్మించి చేతులు దులిపేసుకున్న అధికారులు
- వర్షాకాలంలో డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం
- మూడు జిల్లాల ప్రజలకు ఈ మార్గమే ఆధారం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8:

భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరుపై కూలిపోయిన వంతెన స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి కదలిక లేదు. నిధులున్నా అధికారులు పనులు చేపట్టకపోవడంతో మూడు జిల్లాల ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు.



బీఎన్ రోడ్డులో తాచేరు నదిపై తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు

తాచేరు వంతెన గత డిసెంబరు 19వ తేదీన కూలిపోయిన విషయం తెలిసిందే. దీని వల్ల విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ప్రజలు బీఎన్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు వంతెన పక్కన నుంచి తాత్కాలిక డైవర్షన్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. కొంత వరకు ఇబ్బందులు తొలగినా శాశ్వత పరిష్కారం లభించలేదు.

నిధులున్నా ప్రారంభంకాని పనులు

బీఎన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వడ్డాది నుంచి గంధవరం వరకు రూ.32 కోట్లు మంజూరైన నిధుల్లో, తాచేరుపై నూతన వంతెన నిర్మాణానికి రూ.5.5 కోట్లు అంచనాలు ఆమోదించి ఉన్నందున, తక్షణం తాచేరుపై నూతన వంతెన నిర్మాణ పనులు చేపడతామని ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో చెప్పారు. ఈ వంతెన నిర్మాణ పనులు మొదలవుతాయని మూడు జిల్లాల ప్రజలు ఆశించారు. కానీ ప్రకటన చేసి మూడు నెలలు దాటిపోయినా పనులు ప్రారంభంకాలేదు. అధికారుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైతే తాచేరు నదీ ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. సుమారు పది నెలల వరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉండదు. ప్రస్తుతం తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు వర్షాకాలంలో నదీ ఉధృతికి తగ్గట్టుగా నిర్మాణం జరగనందున కొట్టుకుపోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతే బీఎన్ రోడ్డులో రవాణా కష్టాలు తప్పవని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిధులు ఉన్నందున తక్షణం తాచేరు వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై చోడవరం ఆర్ అండ్ బీ సెక్షన్ ఏఈఈ సత్యప్రసాద్ వివరణ కోరగా బిల్లుల సమస్య కారణంగా సదరు కాంట్రాక్టరు బీఎన్ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారన్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు.



గత ఏడాది డిసెంబరు 19వ తేదీన కూలిపోయిన వంతెన

ఆగని వలంటీర్ల రాజీనామాలు

- అచ్యుతాపురంలో 58 మంది..
- గొలుగొండ మండలంలో 24 మంది..

అచ్యుతాపురం, ఏప్రిల్ 8: మండలంలో సోమవారం మూడు పంచాయతీల నుంచి 58 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో సురేశ్‌కుమార్ తెలిపారు. చోడపల్లి పంచాయతీలో 29 మంది వలంటీర్లుండగా అందరూ రాజీనామా చేశారు. అలాగే తంతడి పంచాయతీ పరిధిలో 12 మందికి గాను 12 మంది, దోసూరులో 18 మంది వలంటీర్లకు గాను 17 మంది రాజీనామాలు చేశారన్నారు.

గొలుగొండ మండలంలో..

గొలుగొండ : మండలంలో సోమవారం పాకలపాడు గ్రామంలో 16 మంది, సాలికమల్లవరంలో 8మంది రాజీనామాలు చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.15
సహరి (బుధ)	4.28

కూటమి శ్రేణుల్లో జోష్

- పవన్ కల్యాణ్ సభ సక్సెస్‌తో ఆనందం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. అనకాపల్లిలో ఆదివారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి యాత్ర విజయవంతం కావడం, అడుగడుగునా ప్రజలు నీరాజనం పలకడంతో శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. పవన్ కల్యాణ్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకోవడంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపించింది. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, అనకాపల్లి దశ మారుస్తానని పవన్ కల్యాణ్ చెప్పడంతో అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభించింది. పవన్ కల్యాణ్ పర్యటన అన్ని వర్గాల ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంది.



అనకాపల్లిలో ఆదివారం జరిగిన పవన్ కల్యాణ్ సభకు పోటెత్తిన జనం

నూకాంబిక ఆలయం కిటకిట

- కొత్త అమావాస్య జాతర సందర్భంగా రద్దీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి కొత్తఅమావాస్య జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారం అమావాస్య గడియలు ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గుడి తలుపులు మూసివేశారు. మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి యథావిధిగా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు.



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తగ్గిన ఉష్ణోగ్రత

» సోమవారం 34.8 డిగ్రీలు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : నాలుగు రోజులుగా పట్టణ ప్రజలను అల్లాడిస్తున్న ఉష్ణోగ్రతలు సోమవారం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. శనివారం 39.8 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం 38.8 డిగ్రీలు నమోదైంది. సోమవారం ఒక్కసారిగా 34.8 డిగ్రీలకు తగ్గిపోయింది. ఒక్క రోజులో నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వాతావరణమంతా కొద్దిగా చల్లగా ఉంది. దీంతో ప్రజలు కూడా రోడ్డెక్కి వారి పనులను చేసుకునేందుకు అవకాశం లభించింది. సాయంత్రం కూడా ఉష్ణోగ్రతలు చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఉగాది కవి సమ్మేళనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం సాహితీమిత్రుల ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరం ఉగాదిని స్వాగతిస్తూ సాహితీ వసంతం పేరిట కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి గొంతిన రంగబాబు అధ్యక్షత వహించారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టాలని వక్తలు పేర్కొన్నారు. సీనియర్ కవి మాధవీసనారా ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఘనంగా సాగింది. కవితలు, పాటలు, పద్యాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో కోరాడ అప్పలరాజు, వజ్రపు త్రినాథ రావు, గంపా శ్రీదేవి, గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వసిద్ధిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అనిత

ఎస్.రాయవరం, ఏప్రిల్ 8: మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాల వారు సోమవారం టీడీపీలోకి చేరారు. మాజీ సర్పంచ్ పడమటి సతీష్ ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో వీరంతా టీడీపీలో చేరారు. వారందరికీ అనిత కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల వెంటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుండుబోగుల గోవిందరావు, ఎం. అప్పలకొండ, అడబాల వెంకటరమణ, జి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీల్లో చేరిన వైసీపీ శ్రేణులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 8: మండలంలో టీడీపీ, జనసేనల్లోకి వైసీపీ శ్రేణులు చేరాయి. కొత్త మోసయ్యపేట నుంచి సీనియర్ వైసీపీ నాయకులు కిల్లాడి చిన్న, గొలగాని శివాజీ ఆధ్వర్యంలో జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో 20 మంది వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే చట్టి రాంబాబు, కారుకుండి సింహాద్రి, పెదపూడి జ్యోతి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో పుర్రే శ్రీనివాస యాదవ్, రాజాన సన్యాసినాయుడు, జనపరెడ్డి నరసింగరావు, రాజాన నానాజీ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

» ఇద్దరు కొబ్బరి దింపు కార్మికులు మృతి

యలమంచిలి, ఏప్రిల్ 8: పశ్చిమ గోదావరి యలమంచిలి మండలం కాజ తూర్పు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూడి అప్పారావు (55), కడియాలు పెదమునియ్య (41) మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు, చిన తినర్ల గ్రామానికి చెందిన కడియాలు పెదమునియ్య కొబ్బరి దింపుకార్మికులుగా పని చేస్తూ జీవనోపాధి నిమిత్తం పదేళ్లగా నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంకలో నివాసం ఉంటున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు తీసేందుకు అప్పారావు, పెద మునియ్యలు బైక్‌పై సోమవారం ఉదయం గుడిమెళ్లంక నుంచి వస్తుండగా కాజ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అప్పారావు కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు వినియోగంపై కళాజాత

అచ్యుతాపురం, ఏప్రిల్ 8: ఓటు హక్కు వినియోగంపై పూడిమడక, డిబ్బపాలెంలలో కళాజాత సోమవారం ప్రదర్శనలు ఇచ్చారు. ఓటు హక్కు సక్రమంగా వినియోగించటం వల్ల కలిగే ఫలితాలు గురించి నృత్యప్రదర్శన ద్వారా తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు ఓటుహక్కుని వినియోగించుకోవాలని సూచించారు. సరైన నాయకుడిని ఎన్నుకోకపోతే కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ కుమార్, వెలుగు ఏపీఓ చినతల్లి పాల్గొన్నారు.

15,16 తేదీల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ

నక్కపల్లి, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 15,16 తేదీల్లో పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో 770 మంది పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులుంటాయని ఆర్వో కె.గీతాంజలి చెప్పారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. పాయకరావుపేట శ్రీప్రకాశ్ విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఈ శిక్షణ వుంటుందని చెప్పారు. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

రెండేళ్లు అయినా అందని కలెక్టరేట్ మరమ్మతుల బిల్లు

» టోకెన్ జారీ అయినా బ్యాంకు ఖాతాలో జమ కాని సొమ్ము

» బిల్లు చెల్లించాలని కోర్టును ఆశ్రయించనున్న కాంట్రాక్టర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)


అనకాపల్లి కలెక్టరేట్

జిల్లాల పునర్విభజన సందర్భంగా రెండేళ్ల కిందట జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనానికి మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లు అందక కాళ్లరిగేలా తిరుగుతున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. ఇది జరిగి రెండేళ్లు కావస్తున్నా బిల్లు అందని పరిస్థితి నెలకొంది. బిల్లు చెల్లించకపోవడంపై తనకు న్యాయం చేయాలని ప్రభుత్వంపై సదరు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

2022 ఏప్రిల్ నెలలో జిల్లాల పునర్విభజన సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి మండలం శంకరంలో ఒక కళాశాల భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.60 లక్షల అంచనాలు రూపొందించారు. అప్పట్లో టెండర్లు పిలిచారు. ఇందులో నర్సీపట్నంకు చెందిన సాలిడ్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ రూ.58.60 లక్షలకు పనులు దక్కించుకుంది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కళాశాల భవనం పూర్తిగా పాడవడంతో పెయింటింగ్ పనులతోపాటు లోపల గదుల్లో ఇంటీరియర్ వర్క్స్ చేపట్టారు. కలెక్టర్, జేసీలకు అధునాతన హంగులతో చాంబర్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో అన్ని విభాగాలకు మరుగుదొడ్లు, సీలింగ్, ఇతరత్రా సివిల్ వర్క్స్‌తోపాటు ఫర్నీచర్ కూడా కాంట్రాక్టరే సమకూర్చారు. మే నెలాఖరు నాటికి కాంట్రాక్టరు మరమ్మతు పనులు పూర్తిచేశారు. 2022 సెప్టెంబరులో కాంట్రాక్టరు చేసిన పనులకు సంబంధించిన చెల్లింపుల కోసం రూ.58.60 లక్షలు బిల్లులను సీఎఫ్ఎంఎస్ ద్వారా రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లు అప్‌లోడ్ చేశారు. దీనికి సంబంధించి ఖజానా శాఖ నుంచి టోకెన్ నంబరు కూడా వచ్చేసింది. టోకెన్ నంబరు జారీ అయ్యాక సాధారణంగా బిల్లులు ఆగవు. కానీ కలెక్టరేట్ మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు టోకెన్ జారీ అయినా డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. వాస్తవానికి పనులు పూర్తయిన వెంటనే బిల్లు చెల్లించాలని కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ కుదిరింది. కొంతవరకు మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరు కొంతమొత్తం పార్టు బిల్లు చెల్లించాలని కోరినా అధికారులు నిధుల కొరత లేదు.. మొత్తం పనులు పూర్తయిన తరువాత చెల్లిస్తామని చెప్పడంతో కాంట్రాక్టరు ఒక్క పైసా అడ్వాన్స్ తీసుకోకుండానే మరమ్మతు పనులు పూర్తి చేశారు. కలెక్టరేట్ పనులు పూర్తిచేసి రెండేళ్లు కావస్తున్నా.. బిల్లు అందక కాళ్లరిగేలా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో అనేకసార్లు బిల్లు చెల్లించాలని వినతిపత్రాలు అందించినా ఎటువంటి స్పందన రాలేదని కాంట్రాక్టరు ఆవేదన చెందుతున్నారు. చేసిన పనులకు బిల్లు చెల్లించకపోవడంపై కాంట్రాక్టరు కర్రి గంగాధర్ కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిసింది.

ఘనంగా కొత్త అమావాస్య పండుగ


తుమ్మపాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్


వెన్నెలపాలెంలో పూజలు చేసిన బండారు


రాజయ్యపేటలో పూజలు చేస్తున్న మహిళలు

కశింకోట, ఏప్రిల్ 8 : మండలంలోని నర్సింగబిల్లిలో నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య పండుగ సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నర్సింగబిల్లి, నూతనగుంటపాలెం గ్రామాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే తాళ్లపాలెంలో నూకాంబిక అమ్మవారి పండుగ సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాయల మురళీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడలో.. మండలంలోని వెన్నెలపాలెంలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దంపతులు పూజలు నిర్వహించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీశ్రీనివాస్ దంపతులు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

తుమ్మపాలలో.. మండలంలోని తుమ్మపాలలో నూకాంబిక అమ్మవారి పండుగ సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

పాయకరావుపేటలో.. కొత్త అమావాస్య పండుగను పట్టణ ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కంటోన్మెంట్ ఏరియాలో ఉన్న నూకాలమ్మ ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు దర్శించుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త అమావాస్య పురస్కరించుకుని పట్టణ వీధుల్లో గరగల సంబరం వేడుకగా నిర్వహించారు.


రాజుకోడూరులో అమ్మవారిని దర్శించేందుకు బారులు తీరిన భక్తులు

రాంబిల్లిలో.. కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని దిమిలి, వెల్చూరు, కొప్పగొండుపాలెం, రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం గ్రామాల్లో సోమవారం నూకాంబిక అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రాజుకోడూరు, కొప్పుగొండుపాలెంల్లో అమ్మవార్లను ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రంగనాయకులు, జనసేన మండల అధ్యక్షుడు నూకన్నదొర దర్శించుకున్నారు.

ఎలమంచిలిలో.. మునిసిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి జాతరలు సోమవారం జరిగాయి. తెల్లవారు నుంచే అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు భగవాన్ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేర్వేరుగా మజ్జిగ సరఫరా చేశారు. పట్టణానికి చెందిన నగిగట్ల బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా ఏటికొప్పాక, పీఎస్ఆర్.పేట, పులపర్తి, పోతిరెడ్డిపాలెంల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. పట్టణంలోని రామ్‌నగర్ శేషుకొండ కాలనీలో సోమవారం స్థానిక ట్రాన్స్‌జెండర్స్ భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతరను జరుపుకున్నారు. ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి శ్రావణి తదితరులు ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు.

సబ్బవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నూకాలమ్మ పండగలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, పంచకర్ల వెంకటేశ్వరరావు, పీబీవీఎస్ఎన్ రాజు, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, అమ్మవారిని దర్శించుకున్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కొత్తమావాస్య జాతర ఘనంగా జరిగింది. నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట, అమలాపురం, కాగిత, జానకయ్యపేట, గొడిచెర్ల, జి.జగన్నాథపురం, గుల్లిపాడు,రేబాకల్లో కొత్త అమావాస్య పండుగ వైభవంగా జరిగింది.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో నూకాలమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గోకులపాడులో మహిళలు పలు రకాల పండి వంటకాలను తయారుచేసి, కేరళ డప్పుల శబ్దాల నడుమ పురవీధిల్లో ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు. గెడ్డపాలెం, భీమవరం, దార్లపూడిల్లో నూకాలమ్మ జాతరను జరిపారు.

నేడు పాయకరావుపేటలో చిలకల తీర్థం

» వేలాదిగా తరలిరానున్న ప్రజలు

» సంప్రదాయబద్ధంగా పేరంటాలమ్మ వేడుక

పాయకరావుపేట, ఏప్రిల్ 8 : పట్టణంలో మంగళవారం చిలకల తీర్థం ఘనంగా జరగనుంది. ఏటా ఉగాది రోజున సంప్రదాయబద్ధంగా జరుపుకునే చిలకల తీర్థం ఈ ప్రాంతానికే ప్రత్యేకం. స్థానిక మంగవరంరోడ్డులో ఉన్న పేరంటాలమ్మ గుడి వద్ద మంగళవారం జరిగే ఈ తీర్థానికి వేలాదిగా తరలివచ్చే భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న రామాలయంలో పండితులతో శ్రీ క్రోధి నామ సంవత్సరంలో తమ రాశిఫలాలు చెప్పించుకుంటారు. ఆలయ వెలుపల నిర్వహించే తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లడం ఆనవాయితీ. పట్టణంలోని రాజాపంతులవారి ఆడబిడ్డగా.. మలిపెద్దివారి కోడలుగా అగ్నిగుండంలోకి ప్రవేశించి స్థానిక మంగవరంరోడ్డులోని సీతారామస్వామివారి ఆలయం వద్ద పేరంటాలమ్మగా వెలసిందని పెద్దలు చెబుతుంటారు. ఉగాది రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల మధ్యలో పేరంటాలమ్మ గుడివద్ద మలిపెద్దివారి కుటుంబ సభ్యుల్లో ఒకరిపైకి పేరంటాలమ్మ వచ్చి భవిష్యవాణి వినిపిస్తారు. అమ్మవారు పుణ్యస్త్రీగా అగ్నిగుండ ప్రవేశం చేసినందున గుడికి వచ్చిన మహిళలంతా సంప్రదాయ సూచికగా తీర్థంలో చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళుతుండడంతో దీనికి 'చిలకల తీర్థం'గా పేరు వచ్చింది. ఈ తీర్థానికి పాయకరావుపేట, తుని పట్టణాలతోపాటు పరిసర 30 గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు. ఈ ఏడాది చిలకల తీర్థానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలతోపాటు నెయ్యి, బెల్లం, శనగపిండితో తయారుచేసే నేతి మిఠాయిని కొనుగోలు చేస్తారు. చిలకల తీర్థంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు మెయిన్‌రోడ్డులోకి వాహనాలు రాకుండా ఆంక్షలు విధించి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తామని ఆయన తెలిపారు.


తీర్థం కోసం సిద్ధం చేసిన పంచదార చిలకలు

వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు

ఒక పత్రంపై రాజీనామాలు చెల్లవని ఎంపీడీవో స్పష్టీకరణ

వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు ఇవ్వాలని సూచన

ఎస్.రాయవరం, ఏప్రిల్ 8: మండలంలోని 438 మంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నట్టు గురజాడ అప్పారావు వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి అసోసియేషన్ లెటర్ హెడ్‌పై వినతిపత్రాన్ని ఆయనతోపాటు కొంతమంది వలంటీర్లు అందజేశారు. తమ రాజీనామాలను ఆమోదించాలని కోరగా.. ఎంపీడీవో స్పందిస్తూ వలంటీర్లంతా రాజీనామాలు చేస్తున్నట్టు ఇచ్చిన ఒకే రాజీనామా పత్రం చెల్లదని, ఎవరికి వారు రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే చెల్లుతుందని స్పష్టం చేశారు. దీంతో మరో రోజు వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు తీసుకువచ్చి సమర్పిస్తామంటూ వారంతా వెనుదిరిగారు. ఈ సందర్భంగా మండల వలంటీర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పలరాజు మాట్లాడుతూ తమకు ప్రతిపక్షాలు ఇబ్బందిపెడుతున్నందున రాజీనామాలు చేస్తున్నట్టు చెప్పారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!

... 7వ పేజీ తరువాయి

తమ నెత్తిన మోపారని మండిపడ్డారు.

సీపీఎస్ ప్రకారం సర్వీస్‌లో చివరకు దాచుకున్న మొత్తంలో సగం ఉద్యోగి చేతికి ఇచ్చి, మిగిలిన సగంపై వచ్చే లాభమే పింఛన్‌గా వస్తుందని మరో టీచర్ వివరించారు. జీపీఎస్ వల్ల ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తం ప్రభుత్వమే తీసుకుని దానిని పెట్టుబడుల్లో పెడితే వచ్చే లాభం పింఛన్‌గా తీసుకోవాలన్నారు. అంటే ఉద్యోగ విరమణ అనంతరం ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోవడమేనన్నారు.

ఠక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించి...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ పింఛన్, గ్రాట్యుటీ ప్రయోజనం కల్పించారు. అయితే పాత విధానమే మేలని ఉద్యోగులు పట్టుబట్టారు. ఎస్పీ ఠక్కర్ కమిటీ ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ దశలో పాదయాత్ర చేపట్టిన జగన్ సీపీఎస్ రద్దు హామీ ఇచ్చారు. జగన్ హామీ నిలబెట్టుకుంటారని నమ్మి ఠక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించామని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మోసం చేస్తారని తాము భావించలేదని వాపోయారు. ప్రభుత్వమే మోసం చేయడంతో ఉమ్మడి జిల్లాలో 30 వేల మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


గునిపూడిలో అట్రాసిటీ కేసుపై విచారణ జరుపుతున్న డీఎస్పీ మోహన్, సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి, ఏప్రిల్ 8: మండలంలోని గునిపూడిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సోమవారం సాయంత్రం డీఎస్పీ మోహన్ విచారణ ప్రారంభించారు. డీఎస్పీ మోహన్, సీఐ విజయ్‌కుమార్ గ్రామానికి వెళ్లి అట్రాసిటీ కేసుపై వివరాలు సేకరించారు. ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం వాలీబాల్ కోర్టు వద్ద జరిగిన గొడవలో తనతో పాటు,తన కులానికి చెందిన కొంతమంది వ్యక్తులపై ఒక వర్గానికి చెందిన వారు దౌర్జన్యం చేసి, అసభ్యకర పదజాలంతో కుల దూషణ చేశారంటూ మాసా వినోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

గొడవలకు దూరంగా వుండండి : సీఐ

నక్కపల్లి, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, యువకులు గొడవలకు దూరంగా వుండాలని సీఐ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం సారిపల్లివానిపాలెంలో ఎన్నికల కోడ్, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై సీఐ అవగాహన కల్పించారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని, ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు, బైక్‌లు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వుండకూడదన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా వుండాలని సూచించారు.

అమ్మవారి ఘటాలు ఊరేగింపులో వాగ్వాదం

ఎలమంచిలి, ఏప్రిల్ 8: స్థానిక బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ఘటాలు ఊరేగింపులో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో పట్టణ పోలీసులు రంగ ప్రవేశంతో వివాదం సద్దుమణిగింది. అమ్మవారి ఘటాల ఊరేగింపు ఎప్పటిలాగా జరగలేదని కొందరు వాగ్వాదానికి దిగడంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. అదే సమయంలో పట్టణ ఎస్ఐ పాపినాయుడు వచ్చి ఇరువర్గాలను శాంతింపజేయడంతో యథావిధిగా ఊరేగింపు కొనసాగించారు.

సింహాద్రిలో పీసీఎస్‌సీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీసీ కార్యదర్శి అసిత్‌పింగ్

పరవాడ, ఏప్రిల్ 8: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో సోమవారం రక్షణ సమన్వయ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) కార్యదర్శి అసిత్‌పింగ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో గల విద్యుత్ సంస్థల నుంచి 33 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంతంలో గ్రిడ్ భద్రతకు సంబంధించిన ఆటంకాలు, గ్రిడ్ సంఘటనలు, ఇతర సమస్యల గురించి చర్చించారు. అనంతరం సింహాద్రిలో గల 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్, సీ వాటర్ పంప్‌హౌస్‌లను సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్ఓపీ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్ఆర్‌పీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మేకా రామకృష్ణ, సింహాద్రి ఓఅండ్ఎం జీఎం జే.డేవిడ్, ఆపరేషన్ విభాగం జీఎం ఆర్.రాజగోపాలన్, సింహాద్రి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అంబలం పూజ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ సన్నిధిలో ఆదివారం రాత్రి మాలధారణ భక్తులు అంబలం పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి మాలధారణ సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనకాపల్లిలో ఐదు చోట్ల చలివేంద్రాలు : రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : ఈ వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు పట్టణంలో ఐదు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అన్నారు. సోమవారం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద డైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ కన్వీనర్ సుధీర్, సభ్యులు, కోటిపల్లి జేజిబాబు, త్రినాథ్ పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలపై విచారణ చేయాలి

పరవాడ, ఏప్రిల్ 8 : ఫార్మాసిటీలో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. ఆల్కలీ, అపిటోరియా పరిశ్రమల ప్రమాదాలపై ఇన్‌స్పెక్షన్ ఆఫ్ ఫ్యాక్టరీ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ,ఎం.ముసిలినాయుడు, చిట్టిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులకు పరామర్శ

పరవాడ, ఏప్రిల్ 8 : ఫార్మాసిటీలో జరిగిన ప్రమాదంలో గాయపడి విశాఖ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్యసేవలు ఎలా అందుతున్నది అడిగి తెలుసుకున్నారు.

కూటమి అధినేతల చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తూరు, ఏప్రిల్ 8 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పింఛను రూ.6వేలు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. అనకాపల్లి రింగురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వికలాంగుల సంక్షేమ సంఘం అనకాపల్లి ఇన్‌చార్జి నాదముని ఫణీంద్ర పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై పవన్‌కల్యాణ్ వైఖరి చెప్పాలి : సీపీఎం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన వైఖరి బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం ఒక ప్రకటనలో కోరారు. ప్రధాన మంత్రి వద్దకు రమ్మంటే కార్మిక సంఘాలు ఎవరూ రాలేదని నిందలు వేసేలా మాట్లాడడం సరికాదన్నారు. ఆదివారం అనకాపల్లిలో పవన్‌కల్యాణ్ చేసిన ప్రసంగం స్పష్టత లేదన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం ఆకస్మికంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయింది. ఈ విషయం గమనించిన అధికారులు వెంటనే దానిపై రాకపోకలు నిలిపివేశారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్ లోపలకు వెళ్లేందుకు ముఖ ద్వారం వైపు మూడు మార్గాలు ఉన్నాయి. అందులో దక్షిణం వైపు ద్విచక్ర వాహనాల పార్కింగ్ సమీపానున్న మార్గాన్ని ఎక్కువ మంది ప్రయాణికులు ఉపయోగించుకుంటారు. ఆ మార్గంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య కిందకు కుంగిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాలను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. వెంటనే దానికి మరమ్మతులు చేపట్టారు. అత్యంత వేగంగా దానిని తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. రెగ్యులర్‌గా వచ్చే రైళ్లను ఇతర ప్లాట్‌ఫారాల పైకి సర్దుబాటు చేస్తున్నారు. దాంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

'రొయ్యల చెరువులపై చర్యలు తీసుకోవాలి'

పాయకరావుపేట, ఏప్రిల్ 8 : మండలంలోని కుమారపురం రెవెన్యూలో ఎటువంటి అనుమతులు లేని రొయ్యల చెరువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రాన్ని తహసీల్దారు కార్యాలయంతోపాటు మత్స్యశాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎన్.బాలానందరెడ్డి, కుప్పిలి సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ ఎటువంటి అనుమతుల్లేకుండా రొయ్యల చెరువులను ఏర్పాటు చేశారన్నారు. వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి విడిచిపెడుతుండడంతో సాగునీరు కలుషితమవుతోందన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రొయ్యల చెరువులను పరిశీలించి అనుమతుల్లేని, నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాని కోరారు. కార్యక్రమంలో ఎన్.టీ.రెడ్డి, ఎన్.దివ్యారెడ్డి, సాయిరెడ్డి, వై.భాస్కర్‌రెడ్డి, ఎన్.సూర్యావతి, ఎన్.సునీత పాల్గొన్నారు.

ఫార్మాసిటీలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

తుమ్మపాల, ఏప్రిల్ 8: ఫార్మాసిటీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలోని పలు కంపెనీల్లో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో అన్యాయంగా కార్మికులు బలైపోతున్నారన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రమాదానికి కారకులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే ఫార్మాసిటీలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

పరవాడ, ఏప్రిల్ 8 : మండలంలోని కలపాకకు వెళ్లే ప్రధాన రహదారిలోని మరిసవానిపాలెం చెరువు వద్ద దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. రహదారి పక్కన పెద్ద గొయ్యి ఏర్పడడంతో రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొంతకాలంగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గొయ్యిను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దండాలు.. దండాలు.. అమ్మోరు తల్లీ...

▸ కొత్త అమావాస్య సందర్భంగా ఊరూరా.. నూకాలమ్మ పండగ ▸ ఆలయాలకు పోటెత్తిన భక్తజనం ▸ ఎటు చూసినా కోలాహలం


నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో విశేష అలంకరణలో అమ్మ


మాకవరపాలెం : కొండల అగ్రహారంలో నూకాంబిక


బుచ్చెయ్యపేట : కెపీ.అగ్రహారంలో క్యూలో ఉన్న భక్తులు


మాడుగుల నూకాలమ్మ కాలనీలో పూజలందుకున్న ఆదిమాత

నర్సీపట్నం, ఏప్రిల్ 8 : కొత్త అమావాస్యను పురస్కరించుకొని పల్లెలు, పట్టణాల్లో నూకాలమ్మ పండను సోమవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. నర్సీపట్నంలోని అబీద్ సెంటర్ గల నూకాలమ్మ గుడిలో తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పసుపు, కుంకుమ, పండ్లు, కాయలు, చీరలు వంటివి సమర్పించి అంతా మొక్కులు చెల్లించుకున్నారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలోని గురందొరపాలెం, గబ్బాడ, నీలంపేట, వేములపూడి, ఎరకన్నపాలెం, కెఎల్.పురం, దుగ్గాడ తదితర గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి పండగను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

గొలుగొండ : నూకాలమ్మ పండగను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ, లింగంపేట, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, కొంగశింగి, కొత్తమల్లంపేట, చోద్యం, పాతమల్లంపేట, జోగంపేట, సాలికమల్లవరం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి పండగలను ఘనంగా నిర్వహించారు. మాకవరపాలెం, కొండలఅగ్రహారం, తూటిపాల, రాచపల్లి, రామన్నపాలెం, భీమబోయినపాలెం, గిడుతూరు తదితర గ్రామాల్లో ఈ వేడుకలను జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోలుగుంట : ఊరూరా నూకాలమ్మ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరుపుకున్నారు. రోలుగుంట, కొమరవోలు, కొండపాలెం, నిండుగొండ, రత్నంపేట, జె.నాయుడుపాలెం గ్రామాల్లో వేకువజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

బుచ్చెయ్యపేట : కొత్త అమావాస్య సందర్భంగా మండలంలో నూకాలమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, కేపీఅగ్రహారం, దిబ్బిడి, రాజాం, మల్లాం, తురకలపూడి, చినప్పన్నపాలెం తదితర గ్రామాల్లో గల అమ్మవార్ల ఆలయాలకు భక్తులు వేకువజాము నుంచి పోటెత్తారు. కేప అగ్రహారంలో భక్తుల తాకిడి పెరగడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

రావికమతం : కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలో నూకాంబిక అమ్మవారి పండగను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత్స్యపురం, కేబీపీ అగ్రహారం, గుడ్డిప, మేడివాడ, కొత్తకోట, జెడ్.కొత్తపట్నం తదితర గ్రామాల్లోని ఆలయాలకు వేకువజాము నుంచి భక్తులు పోటెత్తి పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో భారీ విద్యుత్ దీపాలంకరణలు,పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


రావికమతం : మత్స్యపురంలో నూకాంబిక దర్శనానికి భక్తుల క్యూ



మాడుగుల : పట్టణంలోని నూకాలమ్మ కాలనీలో సోమవారం నూకాలమ్మ జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ వేడుక సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

దేవరాపల్లి : మండలంలోని దేవరాపల్లి, మామిడిపల్లి, నాగయ్యపేట, కాశీపురం, ఎ.కొత్తపల్లి, ఎం.అలమండ తదితర గ్రామాల్లో నూకాంబిక పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కె.కోటపాడు : నూకాంబిక పండగను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కొన్నిచోట్ల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

చీడికాడ: మండల కేంద్రం చీడికాడతో పాటు అన్ని గ్రామాల్లో నూకాలమ్మ పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తంగుడుపల్లి, చినగోగాడ గ్రామాల్లో మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

వైసీపీ నుంచి 100 మంది టీడీపీలో చేరిక

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 : మండలంలోని విజయరామరాజుపేటలో వైసీపీని వీడి వంద మంది టీడీపీ గూటికి చేరారు. స్వతంత్ర ఎంపీటీసీ కోరుబిల్లి బాలకృష్ణతో పాటు వైసీపీ నాయకుడు మళ్ల వెంకట్రావులు తన అనుయాయులైన వందమందితో కలిసి ఆదివారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో వీరికి చోడవరం మాజీ ఎమ్మెల్యే రాజు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, దొడ్డి కిశోర్, తమరాన దాసు, జెట్టి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు


రైతులకు సూచనలిస్తున్న విద్యార్థినులు

చీడికాడ, ఏప్రిల్ 8 : పంటలు వేసే ముందుకు భూసార పరీక్షలు చేయడం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చునని ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల, నైరా వ్యవసాయ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు తెలిపారు. సోమవారం చెట్టుపల్లిలో పర్యటించి తొలుత గ్రామ పటం ద్వారా వనరులను గుర్తించారు. గ్రామంలో పల్లపు భూములు, మెట్టు భూములు ఎన్నెన్ని ఎకరాలు ఉన్నాయో తెలుసుకున్నారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడుతూ పం టలు పండించేందుకు ముందుగా వేసవి దుక్కులు మెత్తగా దున్నాలని, అనంతరం భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, ప్రకృతి వ్యవసాయ సాగుపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె గణేశ్, మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

3,950 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

నర్సీపట్నం, ఏప్రిల్ 8 : పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల ఓ దుకాణంలో నిల్వ ఉంచిన 3,950 కిలోల రేషన్ బియ్యాన్ని సోమవారం సీజ్ చేసినట్టు పట్టణ ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి దుకాణ యజమాని పాత సంతబయిలుకి చెందిన గులవర్తి రామకోటిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలు

గొలుగొండ, ఏప్రిల్ 8 : బైక్ అదుపు తప్పి ఓ యువకుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. ఈ ఘటనలో ఓ ఆవు కూడా మృతిచెందింది. ఇందుకు సంబంధించి ఆ గ్రామస్థులు తెలిపిన వివరాలివి. మండలంలోని కృష్ణాదేవిపేట వద్ద జాతీయ రహదారి నుంచి సోమవారం వెంకటేశ్ అనే యువకుడు బైక్‌పై వెళుతున్నాడు. ఆ సమయంలో రోడ్డుకు అడ్డంగా ఆవు రావడంతో దానిని ఢీకొన్నాడు. దీంతో అది అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం బైక్ బోల్తా పడడంతో అతడికి కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించగా, అక్కడి నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు.

ఎన్ని కుట్రలు పన్నినా కూటమి విజయం తథ్యం

▸ వైసీపీ కుయుక్తులకు గత స్థానిక సంస్థలు, తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో అరాచకాలే నిదర్శనం

▸ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్ ఇక ఇంటికే.. ▸ అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్


వడ్డాదిలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

బుచ్చెయ్యపేట, ఏ ప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయం తథ్యమని అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ స్పష్టం చేశారు. వడ్డాదిలో సోమవారం టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్ ఎన్నికల్లో విజయానికి అక్రమాలపై ఆధారపడ్డారని ఆరోపించారు. ఇందుకు స్థానిక సంస్థల ఎన్నికలు, తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికే నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్నింటా అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ నాయకులు దొడ్డి కిశోర్, గొన్నాబత్తుల శ్రీను, దొండా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల లాగిన్ నుంచి వలంటీర్ల పేర్లు తొలిగించాలి

▸ రాజీనామాల వెనుక రాజకీయ కుట్ర ▸ ఎంపీడీవోకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు 'అల్లు' ఫిర్యాదు


ఎంపీడీవోకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, ఏప్రిల్ 8 : పంచాయతీ కార్యదర్శుల లాగిన్ నుంచి వలంటీర్ల పేర్లను తొలగించాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు కోరారు. ఈ మేరకు ఇక్కడి ఎంపీడీవో చంద్రరావును సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంత వరకు చేసిన రాజీనామాల వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వారు రాజీనామాలు సమర్పించినప్పటికీ ఇంత వరకు పంచాయతీ కార్యదర్శుల లాగిన్ నుంచి వారి పేర్లను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లఘన చేసినట్టు కాదా.. అని ప్రశ్నించారు. రాజీనామాలు చేసి వారం రోజులు అవుతున్నా కార్యదర్శుల లాగిన్ నుంచి తొలిగించక పోవడంతో కొన్ని చోట్ల సచివాలయాలకు వచ్చి పనులు చక్కబెడుతున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణమే స్పందించకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ నాయకులు దువ్వాసి వెంకటగిరి, కోసూరు శ్రీనివాసరావు ఉన్నారు.

సంతలో చింతపండు చకచకా కొనుగోళ్లు


గిరిజనులు సంతకు విక్రయానికి తెచ్చిన చింతపండు

మాడుగుల, ఏప్రిల్ 8 : చింతపండు రైతులకు ఈ ఏడాది కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని చెప్పవచ్చు. సీజన్ ఆరంభం నుంచి ధర ఆశాజనకంగా ఉండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మాడుగులలో జరిగిన వారపు సంతకు కావిడ్లతో ఏజెన్సీ ప్రాంతమైన ఈదులపాలెం, కక్కి, వంట్లమామిడి, దేవాపురం, సలుగు, కందులుపాలెం తదితర గిరిజన గ్రామాల నుంచి రైతులు తెచ్చారు. బొట్ట పెద్దదిగా, నాణ్యత కలిగి ఉండడంతో కొనుగోలుకు వ్యాపారులు పోటీపడ్డారు. సుమారు 30 కిలోలకు పైబడిన కావిడి చింతపండు ధర రూ.రెండు వేల నుంచి రూ. రెండు వేల నాలుగు వందల వరకు అమ్మడైంది. కొత్త అమావాస్య కావడంతో సంతకు వచ్చిన సరకు తక్కువ కావడంతో వ్యాపారులు రైతులు కావిడలు దించిన క్షణాల్లోనే హాట్‌కేకుల్లా కొనుక్కొని వెళ్లిపోయారు.

19 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

రోలుగుంట, ఏప్రిల్ 8 : మండల కేంద్రం రోలుగుంటలో కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19న ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు, నిత్యహోమాలు, ఆరాధన, చూర్ణోత్సవం, వసంతోత్సవం వంటి పూజలు ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

'ఉపాధి పనుల్లో జాగ్రత్తలు అవసరం'


కూలీల మస్తరు షీటును పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, ఏప్రిల్ 8 : ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్న కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు సూచించారు. పైడిపాల, మాకవరపాలెం, రాచపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎండల తీవ్ర అధికంగా ఉన్నందున ఉదయం ఆరు గంటల నుంచి పదిగంటల వరకు పనులు చేపట్టాలన్నారు. అనంతరం కూలీల మస్తరు పత్రాలను పరిశీలించారు.

వడ్డాదిలో 20 మద్యం సీసాలు పట్టివేత

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 : వడ్డాదిలో సోమవారం బెల్టు షాపుపై పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరవై క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

గొలుగొండ, ఏప్రిల్ 8 : పాత కృష్ణాదేవిపేట శివారులో సోమవారం కృష్ణాదేవిపేట పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ ఉపేంద్రతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!

... 7వ పేజీ తరువాయి

తమ నెత్తిన మోపారని మండిపడ్డారు.

సీపీఎస్ ప్రకారం సర్వీస్‌లో చివరకు దాచుకున్న మొత్తంలో సగం ఉద్యోగి చేతికి ఇచ్చి, మిగిలిన సగంపై వచ్చే లాభమే పింఛన్‌గా వస్తుందని మరో టీచర్ వివరించారు.

జీపీఎస్ వల్ల ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తం ప్రభుత్వమే తీసుకుని దానిని పెట్టుబడుల్లో పెడితే వచ్చే లాభం పింఛన్‌గా తీసుకోవాలన్నారు. అంటే ఉద్యోగ విరమణ అనంతరం ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోవడమేనన్నారు.

ఠక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించి...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ పింఛన్, గ్రాట్యుటీ ప్రయోజనం కల్పించారు. అయితే పాత విధానమే మేలని ఉద్యోగులు పట్టుబట్టారు. ఎస్‌పీ ఠక్కర్ కమిటీ ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ దశలో పాదయాత్ర చేపట్టిన జగన్ సీపీఎస్ రద్దు హామీ ఇచ్చారు. జగన్ హామీ నిలబెట్టుకుంటారని నమ్మి ఠక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించామని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మోసం చేస్తారని తాము భావించలేదని వాపోయారు. ప్రభుత్వమే మోసం చేయడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.

టేకు కలప అక్రమ తరలింపునకు సిద్ధం!

▸ రామన్నపాలెం తోటలో దుంగలుగా కోసి ఉంచిన వైనం ▸ పట్టించుకోని అధికారులు


తరలింపునకు సిద్ధంగా ఉంచిన టేకు దుంగలు

మాకవరపాలెం, ఏప్రిల్ 8 : విలువైన టేకు కలప దుంగలు మండలంలోని రామన్నపాలెం తోటలో గట్టుగా పడి ఉండడం చర్చనీయాంశంగా మారింది. రామన్నపాలెం సెంటర్‌లోని ఏలేరు కాలువ ఎడమ గట్టుకు ఆనుకొని ఉన్న వెదురు పొంత వెనుక అనుమతులు లేకుండా టేకు కలపను నిల్వ చేసి ఉంచారు. ఇక్కడి నుంచి రాత్రి సమయాల్లో పలు కర్రల మిల్లలకు అక్రమార్కులు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామన్నపాలెం ప్రాంతానికి అనుకొని ఉన్న అటవీ భూములతో పాటు ప్రభుత్వ భూముల్లో ఉన్న టేకు, అరికీలీస్ చెట్లను రాత్రి సమయాల్లో నరికివేసి ఇక్కడ నిల్వ ఉంచుతున్నట్టు పలువురు చెబుతున్నారు. అనంతరం ఇక్కడి నుంచి అమ్మకాలు జరుపుతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికే ట్రాక్టర్ లోడు కలపను తరలించేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కలప అక్రమంగా తరలించేవారిపై దృష్టి సారించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : స్థానిక మెయిన్‌రోడ్డులో ఒక వ్యక్తి నుంచి సోమవారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం శివరామపురం గ్రామానికి చెందిన నమ్మి సత్యారావు పట్టణంలోని మద్యం దుకాణాల్లో 12 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా మల్లిమ ఖుగుల వారి వీధి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కూటమికి మద్దతు తెలిపే అధికారులను బెదిరించడమే
స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ లక్ష్యం

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్
- చోడవరం స్టేషన్‌లో విచారణకు హాజరు
- అధికారుల పట్ల తాము అమర్యాదకరంగా ప్రవర్తించలేదని వివరణ

చోడవరం, ఏప్రిల్ 8: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేనలకు మద్దతుగా నిలిచే వ్యాపారులను వేధించడం, బెదిరించడమే లక్ష్యంగా స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ అధికారులు పనిచేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆరోపించారు. చోడవరం పట్టణ శివారు గాంధీగ్రామంలో టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు దుకాణంలో ఈనెల నాలుగో తేదీన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాడుల సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సీఎం రమేశ్, చోడవరం టీడీపీ అభ్యర్థి రాజు, తదితరులు...డీఆర్‌వో అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఎం రమేశ్, తదితరులు తమ పట్ల అనుచితంగా వ్యవహరించారంటూ ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలంటూ చోడవరం పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోమవారం సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాజు, టైల్స్ వ్యాపారి బుచ్చిబాబుతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు ఎదుట హాజరయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖలో ఓ అధికారిపై చాలా ఆరోపణలు ఉన్నాయని, కేవలం కక్షపూరితంగానే వ్యాపారి బుచ్చిబాబుపై ఈ దాడులు జరిగినట్టు తమకు సమాచారం ఉందని సీఎం రమేశ్ ఈ సందర్భంగా డీఎస్పీకి వివరించారు. ఆ అధికారి తీరుపై తాము ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తదితరులకు ఫిర్యాదు చేశామన్నారు. దాడి జరిగిన సమయంలో వ్యాపారి నుంచి రూ.25 లక్షలు తీసుకున్నారని, ఆ డబ్బు ఏమైందో విచారణ చేయాలని డీఎస్పీని కోరారు. అధికారులను మీడియా సమక్షంలో ప్రశ్నించాం తప్ప, వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని స్పష్టంచేశారు. ఇది పూర్తిగా తప్పుడు కేసు అని, తమపై అధికారులు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వివరణ ఇచ్చారు. దీనిపై డీఎస్పీ అప్పలరాజు మాట్లాడుతూ, ఈ కేసుపై తాము సమగ్రంగా విచారణ చేస్తామని చెప్పారు. అనంతరం 41 సీఆర్‌పీసీ నోటీసులు ఎంపీకి, మాజీ ఎమ్మెల్యే రాజు, తదితరులకు అందజేసి వారితో సంతకాలు తీసుకున్నారు.



డీఎస్పీ అప్పలరాజుతో మాట్లాడుతున్న సీఎం రమేశ్

రెండు నెలల క్రితమే ప్రణాళిక

పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సీఎం రమేశ్ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీలకు మద్దతుగా నిలబడే వ్యాపారులపై దాడులు చేయడం, బెదిరించి దారికి తెచ్చుకోవడం లక్ష్యంగా రెండు నెలల క్రితమే ఈ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించారని విమర్శించారు. తనిఖీలకు వచ్చిన శాఖ అధికారులకు జీఎస్‌టీతో ఎలాంటి సంబంధం లేదని, ఆ శాఖ అధికారులకు జీఎస్‌టీ గురించి ప్రశ్నించవలసిన అవసరం ఏమీ లేదని తెలిపారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష వ్యాపారులపై వేధింపులు, దాడులు లక్ష్యంగా తయారైన స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖను రద్దు చేయాలని తాము కేంద్రానికి ఫిర్యాదు చేశామని స్పష్టంచేశారు. టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీకి చెల్లించవలసిన ట్యాక్స్ కట్టలేక, అతని వేధింపులు భరించలేక తమను ఆశ్రయించారన్నారు. అమాయక వ్యాపారులను బెదిరించి దారికి తెచ్చుకొనేందుకు వైసీపీ నేతలు చేస్తున్న యత్నాలను తాము అడ్డుకుని తీరతామన్నారు.

క్రైం... crime news

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి


మృతుడు శివ (ఫైల్)

గొలుగొండ, ఏప్రిల్ 8 : అప్పుల బాధ తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని పాతమల్లంపేట శివారు ద్వారకా నగరం గ్రామానికి చెందిన రాయపురెడ్డి శివ(40) ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక సుమారు ఇరవై రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ సోమవారం ప్రాణాలు విడిచినట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి భార్యా అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

విశాఖపట్నం, ఏప్రిల్ 8: తమకు పిల్లలు పుట్టకపోవడంతో పాటు ఇటీవల తండ్రి మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెంకటాపురానికి చెందిన ఎ.సూర్యారావు (42) భార్య మణితో కలిసి అగనంపూడి సమీపంలోని కొండయ్య వలసలో నివాసం ఉంటున్నారు. సూర్యారావు అచ్యుతాపురంలోని ఓ ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కాగా ఈ నెల ఐదున తండ్రి మృతి చెందడంతో సూర్యారావు భార్య మణితో కలిసి తమ స్వగ్రామం వెళ్లారు. ఆదివారం సూర్యారావు ఒక్కరే ఇక్కడకు చేరుకోవడంతో పాటు రాత్రి ఏడున్నరప్పుడు భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. అయితే సోమవారం ఉదయం ఎంతసేపటికీ సూర్యారావు తలుపులు తెరవకపోవడంతో ఇరుగు పొరుగు వాళ్లు వచ్చి చూసేసరికి ఆయన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. దీంతో స్థానికులు దువ్వాడ పోలీసులకు, మణికి ఫోన్‌లో సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరు మృతి

యలమంచిలి, ఏప్రిల్ 8: పశ్చిమ గోదావరి యలమంచిలి మండలం కాజ తూర్పు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూడి అప్పారావు (55), కడియాలు పెదమునియ్య (41) మృతి చెందినట్లు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉప్మాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు, చిన ఆనర్ల గ్రామానికి చెందిన కడియాలు పెదమునియ్య కొబ్బరి దింపుకార్మికులుగా పనిచేస్తూ జీవనోపాధి నిమిత్తం పదేళ్లుగా నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంకలో నివాసం ఉంటున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు తీసేందుకు అప్పారావు, పెద మునియ్యలు బైక్‌పై సోమవారం ఉదయం గుడిమెళ్లంక నుంచి వస్తుండగా కాజ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అప్పారావు కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : స్థానిక మెయిన్‌రోడ్డులో ఒక వ్యక్తి నుంచి సోమవారం 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం శివరామపురం గ్రామానికి చెందిన నమ్మి సత్యారావు పట్టణంలోని మద్యం దుకాణాల్లో 12 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా మల్లిమఋగుల వారి వీధి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

లూలూరులో ఆరు ఎకరాల జీడితోట దగ్ధం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడితోట

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 8 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని లూలూరు రెవెన్యూ పరిధిలో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆరు ఎకరాల జీడితోట దగ్ధం కావడంతో సుమారు రూ.10 లక్షల వరకు పంట నష్టం సంభవించింది. ఎల్.సింగవరం గ్రామ మాజీ సర్పంచ్ కరణం కాసులమ్మ ఆరు ఎకరాల జీడితోట సాగు చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వ్యవసాయ బోరుకు విద్యుత్‌ను సరఫరా చేసే వైర్ల నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు తోటలోని ఎండుటాకులపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగాయి. అదే సమయంలో గాలులు వీచడంతో సమీప రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ తోట మొత్తం అగ్నికి ఆహుతైయింది. ఈ సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చినప్పటికీ ఘటనా స్థలానికి చేరుకునేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో వారు వెనుదిరిగారు. టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు సదరు జీడీతోటను పరిశీలించి, బాధిత రైతు కాసులమ్మతో మాట్లాడారు. లోపూడి సచివాలయం వీఏఏ బ్లెసీ ప్రమాదం వివరాలను సేకరించారు.

ఇరవై అడుగుల గిరినాగు హతం



నాతవరం, ఏప్రిల్ 8 : మండలం లోని మాధవనగరంలో సోమవారం ఇరవై అడుగుల పొడవున్న గిరినాగును గ్రామస్థులు హతమార్చారు. కొండపక్కనే ఉన్న ఈ గ్రామంలో గల పూరింటిలోకి ఈ పాము ప్రవేశించింది. దానిని చూసినవారంతా హడలిపోయారు. అక్కడి నుంచి ఎంత అదిరించినా వెళ్లకపోవడంతో చివరకు చేసేది లేక ప్రాణభయంతో కర్రలతో హతమార్చారు. ఈ పామును చూసేందుకు జనం ఎగబడ్డారు.

తగ్గిన ఉష్ణోగ్రతలతో జనం ఉపశమనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 8 : గత నాలుగు రోజులుగా పట్టణ ప్రజలను అల్లాడిస్తున్న ఉష్ణోగ్రతలు సోమవారం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. శనివారం 39.8 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం 38.8 డిగ్రీలు నమోదైంది. సోమవారం ఒక్కసారిగా 34.8 డిగ్రీలకు తగ్గిపోయింది. ఒక్క రోజులో నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి చిన్నపాటి మేఘం మాదిరిగా వాతావరణమంతా నీడను తలపించింది. దీంతో ప్రజలు కూడా రోడ్డెక్కి వారి పనులను చేసుకునేందుకు అవకాశం లభించింది. సాయంత్రం కూడా ఉష్ణోగ్రతలు చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

కూటమికి మద్దతిస్తే బెదిరింపులు

- స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ లక్ష్యం ఇదే..
- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఆరోపణ
- చోడవరం స్టేషన్‌లో విచారణకు హాజరు
- అధికారుల పట్ల తాము అమర్యాదకరంగా ప్రవర్తించలేదని వివరణ


డీఎస్పీ అప్పలరాజుతో మాట్లాడుతున్న సీఎం రమేష్

చోడవరం, ఏప్రిల్ 8: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేనలకు మద్దతుగా నిలిచే వ్యాపారులను వేధించడం, బెదిరించడమే లక్ష్యంగా స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్ అధికారులు పనిచేస్తున్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణ శివారు గాంధీగ్రామంలో టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు దుకాణంలో ఈనెల నాలుగో తేదీన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాడుల సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సీఎం రమేష్, చోడవరం టీడీపీ అభ్యర్థి రాజు, తదితరులు... డీఆర్‌వో అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఎం రమేష్, తదితరులు తమ పట్ల అనుచితంగా వ్యవహరించారంటూ ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ చోడవరం పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోమవారం సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే రాజు, టైల్స్ వ్యాపారి బుచ్చిబాబుతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు ఎదుట హాజరయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖలో ఓ అధికారిపై చాలా ఆరోపణలున్నాయని, కేవలం కక్షపూరితంగానే వ్యాపారి బుచ్చిబాబుపై ఈ దాడులు జరిగినట్టు తమకు సమాచారం ఉందని సీఎం రమేశ్ డీఎస్పీకి వివరించారు. ఆ అధికారి తీరుపై తాము ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులకు ఫిర్యాదు చేశామన్నారు. దాడి జరిగిన సమయంలో వ్యాపారి నుంచి రూ.25 లక్షలు తీసుకున్నారని, ఆ డబ్బు ఏమైందో విచారణ జరిపించాలని డీఎస్పీని కోరారు. అధికారులను మీడియా సమక్షంలో ప్రశ్నించాం తప్ప, వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదని వివరించారు. ఇది పూర్తిగా తప్పుడు కేసు అని, తమపై అధికారులు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వివరణ ఇచ్చారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ, ఈ కేసుపై తాము సమగ్రంగా విచారణ చేస్తామని చెప్పారు. అనంతరం 41 సీఆర్‌పీసీ నోటీసులు ఎంపీకి, మాజీ ఎమ్మెల్యే రాజు, తదితరులకు అందజేసి సంతకాలు తీసుకున్నారు.

రెండు నెలల క్రితమే స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ప్రణాళిక

పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సీఎం రమేశ్ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పార్టీలకు మద్దతుగా నిలబడే వ్యాపారులపై దాడులు చేయడం, బెదిరించి దారికి తెచ్చుకోవడం లక్ష్యంగా రెండు నెలల క్రితమే ఈ స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందించారని విమర్శించారు. తనిఖీలకు వచ్చిన సదరు శాఖ అధికారులకు జీఎస్‌టీతో ఎలాంటి సంబంధం లేదని, ఆ శాఖ అధికారులకు జీఎస్‌టీ గురించి ప్రశ్నించవలసిన అవసరం ఏమీ లేదని తెలిపారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష వ్యాపారులపై వేధింపులు, దాడులు లక్ష్యంగా తయారైన స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖను రద్దు చేయాలని తాము కేంద్రానికి ఫిర్యాదు చేశామని స్పష్టంచేశారు. టైల్స్ వ్యాపారి బుచ్చిబాబు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీకి చెల్లించవలసిన ట్యాక్స్ కట్టలేక, అతని వేధింపులు భరించలేక తమను ఆశ్రయించారన్నారు. అమాయక వ్యాపారులను బెదిరించి దారికి తెచ్చుకోనేందుకు వైసీపీ నేతలు చేస్తున్న యత్నాలను అడ్డుకుని తీరతామన్నారు. వైసీపీ నేతల ఆగడాలను తాము సహించేది లేదని, వ్యాపారులకు, ప్రజలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా తాము భయపడేది లేదని ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. తాను బ్యాంకు రుణాలు ఎగ్గొట్టానని ఇతరత్రా అక్రమ వ్యాపారాలు చేస్తానని 'సాక్షి' పత్రిక ప్రచారం చేస్తున్నదని, తనపై ఎలాంటి అవినీతి మరకలు లేవన్న విషయాన్ని వారు తెలుసుకోవాలన్నారు. సీఎం రమేష్ వెంట మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

బిల్లో... మొర్రో!

- కలెక్టర్ కార్యాలయానికి మరమ్మతులు
- రెండేళ్లు అయినా బిల్లు అందక కాంట్రాక్టర్ గగ్గోలు
- టోకెన్ జారీ అయినా బ్యాంకు ఖాతాలో జమ కాని సొమ్ము
- బిల్లు చెల్లించాలని కోర్టును ఆశ్రయించనున్న కాంట్రాక్టర్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాల పునర్విభజన సందర్భంగా రెండేళ్ల కిందట జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనానికి మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు బిల్లు అందక కాళ్లరిగేలా తిరుగుతున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. ఇది జరిగి రెండేళ్లు కావస్తున్నా బిల్లు అందని పరిస్థితి నెలకొంది. బిల్లు చెల్లించకపోవడంపై తనకు న్యాయం చేయాలని ప్రభుత్వంపై సదరు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళితే..

2022 ఏప్రిల్ నెలలో జిల్లాల పునర్విభజన సందర్భంగా వైసీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి మండలం శంకరంలో ఒక కళాశాల భవనాలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.60 లక్షల అంచనాలు రూపొందించారు. అప్పట్లో టెండర్లు పిలిచారు. ఇందులో నర్సీపట్నంకు చెందిన సాలీడ్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ రూ.58.60 లక్షలకు పనులు దక్కించుకుంది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కళాశాల భవనం పూర్తిగా పాడవడంతో పెయింటింగ్ పనులతోపాటు లోపల గదుల్లో ఇంటీరియర్ వర్క్స్ చేపట్టారు. కలెక్టర్, జేసీలకు అధునాతన హంగులతో చాంబర్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో అన్ని విభాగాలకు మరుగుదొడ్లు, సీలింగ్, ఇతరత్రా సివిల్ వర్క్స్‌తోపాటు ఫర్నీచర్ కూడా కాంట్రాక్టరే సమకూర్చారు. మే నెలాఖరు నాటికి కాంట్రాక్టరు మరమ్మతు పనులు పూర్తిచేశారు. 2022 సెప్టెంబరులో కాంట్రాక్టరు చేసిన పనులకు సంబంధించిన చెల్లింపుల కోసం రూ.58.60 లక్షలు బిల్లులను సీఎఫ్ఎంఎస్ ద్వారా రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లు అప్‌లోడ్ చేశారు. దీనికి సంబంధించి ఖజానా శాఖ నుంచి టోకెన్ నంబరు కూడా వచ్చేసింది. టోకెన్ నంబరు జారీ అయ్యాక సాధారణంగా బిల్లులు ఆగవు. కానీ కలెక్టరేట్ మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు టోకెన్ జారీ అయినా డబ్బులు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. వాస్తవానికి పనులు పూర్తయిన వెంటనే బిల్లు చెల్లించాలని కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ కుదిరింది. కొంతవరకు మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టరు కొంతమొత్తం పార్టు బిల్లు చెల్లించాలని కోరినా అధికారులు నిధుల కొరత లేదు.. మొత్తం పనులు పూర్తయిన తరువాత చెల్లిస్తామని చెప్పడంతో కాంట్రాక్టరు ఒక్క పైసా అడ్వన్స్ తీసుకోకుండానే మరమ్మతు పనులు పూర్తి చేశారు. కలెక్టరేట్ పనులు పూర్తిచేసి రెండేళ్లు కావస్తున్నా.. బిల్లు అందక కాళ్లరిగేలా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో అనేకసార్లు బిల్లు చెల్లించాలని వినతిపత్రాలు అందించినా ఎటువంటి స్పందన రాలేదని కాంట్రాక్టరు ఆవేదన చెందుతున్నారు. చేసిన పనులకు బిల్లు చెల్లించకపోవడంపై కాంట్రాక్టరు కర్రి గంగాధర్ కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిసింది.

'సింహాద్రి'లో పీసీఎస్‌సీ సమావేశం

- దక్షిణ ప్రాంతంలో గ్రిడ్ భద్రత, ఇతర సమస్యలపై చర్చ
- ఆరు రాష్ట్రాల నుంచి హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీసీ కార్యదర్శి అసిత్‌సింగ్

పరవాడ, ఏప్రిల్ 8 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో సోమవారం రక్షణ సమన్వయ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) కార్యదర్శి అసిత్‌సింగ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో గల విద్యుత్ సంస్థల నుంచి 33 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణ ప్రాంతంలో గ్రిడ్ భద్రతకు సంబంధించిన ఆటంకాలు, గ్రిడ్ సంఘటనలు, ఇతర సమస్యల గురించి చర్చించారు. అనంతరం సింహాద్రిలో గల 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్, సీ వాటర్ పంప్‌హౌస్ తదితరాలను సభ్యులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్ఓపీ సంజయ్ కుమార్ సిన్హా, ఎస్ఆర్‌పీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మేకా రామకృష్ణ, సింహాద్రి ఓఅండ్ఎం జీఎం జే.డేవిడ్, ఆపరేషన్ విభాగం జీఎం ఆర్. రాజగోపాలన్‌తో పాటు సంస్థలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య పండగ జరుపుకున్న ట్రాన్స్‌జెండర్లు



ఎలమంచిలి, ఏప్రిల్ 8: పట్టణంలోని రామ్‌నగర్ శేషుకొండ కాలనీలో సోమవారం స్థానిక ట్రాన్స్‌జెండర్స్ భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య జాతరను జరుపుకున్నారు. ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి శ్రావణి తదితరులు అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా

- ఒక పత్రంపై రాజీనామాలు చెల్లవంటూ ఎంపీడీవో స్పష్టీకరణ
- వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు ఇవ్వాలని సూచన

ఎస్.రాయవరం, ఏప్రిల్ 8: మండలంలోని 438 మంది వలంటీర్లు రాజీనామా చేస్తున్నట్టు గురజాడ అప్పారావు వలంటీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి అసోసియేషన్ లెటర్ హెడ్‌పై వినతిపత్రాన్ని ఆయనతోపాటు కొంతమంది వలంటీర్లు అందజేశారు. తమ రాజీనామాలను ఆమోదించాలని కోరగా.. ఎంపీడీవో స్పందిస్తూ వలంటీర్లంతా రాజీనామాలు చేస్తున్నట్టు ఇచ్చిన ఒకే రాజీనామా పత్రం చెల్లదని, ఎవరికి వారు రాజీనామా పత్రాలు సమర్పిస్తేనే చెల్లుతుందని స్పష్టం చేశారు. దీంతో మరో రోజు వ్యక్తిగతంగా రాజీనామా పత్రాలు తీసుకువచ్చి సమర్పిస్తామంటూ వారంతా వెనుదిరిగారు.ఈ సందర్భంగా మండల వలంటీర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పలరాజు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కారణాల వలన ప్రజాసేవ చేస్తున్న తమకు ప్రతిపక్షాలు ఇబ్బందిపెడుతున్నందున రాజీనామాలు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు చిలకల తీర్థం

- వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- సంప్రదాయబద్ధంగా పేరంటాలమ్మ వేడుక
- ఈ తీర్థంలో చిలకలు, చేటలు, శనగపిండి నేతి మిఠాయి ప్రత్యేకత
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు : సీఐ అప్పలరాజు


పాయకరావుపేటలోని పేరంటాలమ్మ గుడి

పాయకరావుపేట, ఏప్రిల్ 8 : పట్టణంలో మంగళవారం చిలకల తీర్థం ఘనంగా జరగనుంది. ఏటా ఉగాది రోజున సంప్రదాయబద్ధంగా జరుపుకునే చిలకల తీర్థం ఈ ప్రాంతానికే ప్రత్యేకం. స్థానిక మంగవరంరోడ్డులో ఉన్న పేరంటాలమ్మ గుడి వద్ద మంగళవారం జరిగే ఈ తీర్థానికి వేలాదిగా తరలివచ్చే భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న రామాలయంలో పండితులతో శ్రీ క్రోధి నామ సంవత్సరంలో తమ రాశిఫలాలు చెప్పించుకుంటారు. ఆలయ వెలుపల నిర్వహించే తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని రాజాపంతులవారి ఆడబిడ్డగా.. మలిపెద్దివారి కోడలుగా అగ్నిగుండం లోకి ప్రవేశించి స్థానిక మంగవరంరోడ్డులోని సీతారామస్వామివారి ఆలయం వద్ద పేరంటాలమ్మగా వెలసిందని పెద్దలు చెబుతుంటారు. ఈ పేరంటాలమ్మను ఇలవేల్పుగా కొలుస్తున్న ఈ ప్రాంత ప్రజలు ఐదు తరాలుగా ఉగాది రోజున పేరంటాలమ్మను దర్శించుకుంటారు. ఉగాది రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల మధ్యలో పేరంటాలమ్మ గుడివద్ద మలిపెద్దివారి కుటుంబ సభ్యుల్లో ఒకరిపైకి పేరంటాలమ్మ వచ్చి భవిష్యవాణి వినిపిస్తారు. అమ్మవారు పుణ్యస్త్రీగా అగ్నిగుండ ప్రవేశం చేసినందున గుడికి వచ్చిన మహిళలంతా సంప్రదాయ సూచికగా తీర్థంలో చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళుతుండడంతో దీనికి 'చిలకల తీర్థం'గా పేరు వచ్చింది. ఈ తీర్థానికి పాయకరావుపేట, తుని పట్టణాలతోపాటు పరిసర 30 గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు.


సిద్ధం చేసిన పంచదార చిలకలు, చేటలు

ఈ ఏడాది చిలకల తీర్థానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తీర్థంలో పంచదార చిలకలు, రంగుల చేటలతోపాటు నెయ్యి, బెల్లం, శనగపిండితో తయారుచేసే నేతి మిఠాయిని కొనుగోలు చేస్తారు. అయితే మంగవరం రోడ్డుతోపాటు మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయి రోడ్లు ఇరుకుగా మారడంతో తీర్థానికి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది చిలకల తీర్థంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు మెయిన్‌రోడ్డులోకి వాహనాలు రాకుండా ఆంక్షలు విధించి ట్రాఫిక్ కంట్రోల్ చేస్తామని ఆయన తెలిపారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి


కుంగిపోయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం ఆకస్మికంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయింది. ఈ విషయం గమనించిన అధికారులు వెంటనే దానిపై రాకపోకలు నిలిపివేశారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ లోపలకు వెళ్లేందుకు ముఖ ద్వారం వైపు మూడు మార్గాలు ఉన్నాయి. అందులో దక్షిణం వైపు ద్విచక్ర వాహనాల పార్కింగ్ సమీపానున్న మార్గాన్ని ఎక్కువ మంది ప్రయాణికులు ఉపయోగించుకుంటారు. ఆ మార్గంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య కిందకు కుంగిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాలను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. వెంటనే దానికి మరమ్మతులు చేపట్టారు. అత్యంత వేగంగా దానిని తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. మూడు, నాలుగు ప్లాట్‌ఫారాలపైకి రెగ్యులర్‌గా వచ్చే రైళ్లను ఇతర ప్లాట్‌ఫారాల పైకి సర్దుబాటు చేస్తున్నారు. దాంతో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

పుచ్చకాయల సాగు.. ఆదాయం బహు బాగు


పుచ్చకాయలను వ్యాన్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

దేవరాపల్లి, ఏప్రిల్ 8: మండలంలో కొండ కొండాబు, దేవరాపల్లి సమీపంలో పుచ్చకాయల సాగు విస్తారంగా సాగుచేశారు. తామరబ్బ శివారు కొండ కొండాబు వద్ద తాడేపల్లి గూడెంనకు చెందిన ఏవీ కృష్ణారావు, సుమారు పదేళ్లుగా పుచ్చకాయలను సాగు సాగిస్తున్నారు. ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో పంట పండిస్తున్నారు. ఏటా ఈ పొలంలో పుచ్చ సాగు తప్ప మరే పంట వేయడంలేదు. పచ్చి రొట్ట ఎరువు వేసి వాటిని కలియ దున్ని తరువాత పంట సాగుచేస్తున్నారు. ఈఏడాది ఒక్కోకాయ 8నుంచి 12 కిలోల వరకు పెరిగింది. విశాఖపట్నానికి చెందిన వ్యాపారులు పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఎనిమిది ఎకరాల్లో 140 టన్నులు పంట దిగుబడి రాగా , మరో ఇరవై టన్నుల మేర కోయడానికి సిద్ధంగా ఉందని కృష్ణారావు తెలిపారు. టన్ను సైజు (10నుంచి 12 కిలోలు) బట్టి రూ. 12వేలు పలకగా, చిన్నవి 5నుంచి 8 కిలోల వరకు రూ.11వేల చొప్పున విక్రయించినట్టు చెప్పారు. కరోనాలో కాలంలో తప్పా మిగతా రోజుల్లో నష్టం లేకుండా పంట పండుతుందన్నారు.

పదేళ్లనుంచి ఇదే సాగు



సుమారు పది సంవత్సరాల నుంచి పంట వేస్తున్నాను. గతంలో మొక్కజొన్న వేశా. తుపానులకు నష్టం వాటిల్లింది. అప్పటి నుంచి పుచ్చకాయలు సాగు చేస్తున్నాను. నవంబరు నుంచి పంట వేసే ప్రక్రియ చేపడితే.. మార్చి, ఏప్రిల్ మొదటి వారంతో సరి. మరలా వచ్చే ఏడాది వరకు ఖాళీయే.. సైజు బట్టి పుచ్చకాయ ధర పలుకుతుంది. సాగు గిట్టుబాటవుతోంది. **- ఏవీ కృష్ణారావు, సాగుదారు**